TGTEL/26/A7716

ఉద్యమ పోరు

UDYAMA PORU

ప్రతి పదం పోరాట కదం

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 21 | ఆదివారం | 04.10.2026 | పేజీలు : 8 | వెల : 3 /- | ఎడిటర్ - బండారి సుమంత్

మహారాష్ట్రలో వరుస భూకంపాలు..

రెండు గంటల్లో రెండుసార్లు కంపించిన భూమి

- మహారాష్ట్ర హింగోలీ జిల్లాలో వరుస భూకంపాలు
- రెండు గంటల వ్యవధిలో రెండుసార్లు కంపించిన భూమి
- రిక్టర్ స్కేలుపై 4.5గా నమోదైన రెండో భూకంప తీవ్రత

2

అమృత్‌సర్‌లో పట్టపగలే కాల్పుల కలకలం.. సోషల్ మీడియా స్టార్ దారుణ హత్య

- అమృత్‌సర్‌లో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ మ్యాడ్ సంధు దారుణ హత్య
- కార్ వాష్ వద్ద ఉండగా బైక్‌పై వచ్చి కాల్పులు జరిపిన దుండగులు
- తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

2

ఇక ఆటోల వంతు.. కామన్ పాస్‌పై సర్కార్ కీలక ప్రకటన!

- కామన్ పాస్ పరిధిలోకి త్వరలో ఆటోలను తీసుకొస్తామన్న భట్టి విక్రమార్క
- ఒకే కార్డుతో ప్రజా రవాణా వ్యవస్థ మొత్తం అనుసంధానమే లక్ష్యమన్న ప్రభుత్వం
- మెట్రో, బస్సులో ప్రయాణించి పాస్ పనితీరు, ప్రయాణికుల స్పందనను పరిశీలించిన మంత్రులు

2

వరంగల్ ఎయిర్‌పోర్టు పనుల్లో ముందడుగు..

బౌండరీ వాల్‌కు టెండర్ ఖరారు

ప్రహరీ నిర్మాణానికి టెండర్ ఖరారు చేసిన ఏఏఐ

రూ.13.28 కోట్లకే పనులు దక్కించుకున్న సైదాక్స్ ఇన్ఫ్రా

అంచనా కన్నా తక్కువకు బిడ్.. ప్రభుత్వానికి రూ.8 కోట్లు ఆదా

ఉద్యమపోరు, వరంగల్ : వరంగల్ (మామనూరు) ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనుల్లో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మొదటి దశ పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి కాంట్రాక్టు సంస్థను ఖరారు చేసింది. ఎయిర్‌పోర్టుకు కొత్తగా సేకరించిన భూమికి రక్షణ గోడ నిర్మించే పనులను హైదరాబాద్‌కు చెందిన సైదాక్స్ ఇంజనీర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. ఈ కాంట్రాక్టును సెప్టెంబర్ 29న ఖరారు చేశారు. ఈ పనుల కోసం ఏఏఐ రూ.21.39 కోట్లను అంచనా వ్యయంగా నిర్ణయించగా, సైదాక్స్ సంస్థ కేవలం రూ.13.28 కోట్లకే పనులు పూర్తి చేస్తామని...

మిగతా 2వ పేజీ లో..

సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్ పాసులు..!

- పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- మహిళల మాదిరిగానే వృద్ధులకూ ఈ సౌకర్యం కల్పించేందుకు కసరత్తు
- త్వరలోనే అమలు చేస్తామన్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- అర్హతలు, విధివిధానాలు ఖరారుపై దృష్టి
- ప్రస్తుతం రాష్ట్రంలో 48 లక్షల మంది వృద్ధులు ఉన్నట్లు అంచనా

ఉద్యమపోరు, హైదరాబాద్ : తెలంగాణలోని సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వయో వృద్ధులకు కూడా వర్తింపజేసే ప్రతిపాదనను సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 1న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళలతో పాటు పురుషులతో సహా వయోవృద్ధులందరికీ ప్రయోజనం చేకూర్చేలా ఈ పథకాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తే వృద్ధులు ఆసుపత్రులు, పుణ్య క్షేత్రాలు, బంధువుల ఇళ్లకు సులువుగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది.అయితే, ఈ పథకానికి సంబంధించిన అర్హతలు, వయో పరిమితి, ఆదాయ పరిమితులు వంటి అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రభుత్వం త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో చర్చించి మార్గదర్శకాలను ఖరారు చేయనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో వృద్ధుల జనాభా గణనీయంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 32.69 లక్షలుగా ఉన్న వీరి సంఖ్య, ఇప్పుడు సుమారు 48 లక్షలకు (12.5 శాతం) చేరినట్లు అంచనా.

తెలంగాణలో దసరా సెలవులు ఖరారు..

పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22 వరకు మొత్తం 13 రోజుల సెలవులు

జూనియర్ కాలేజీలకు అక్టోబర్ 10 నుంచి 21 వరకు 12 రోజుల పాటు సెలవులు

అక్టోబర్ 23న స్కూళ్లు, 22న కాలేజీలు తిరిగి పునఃప్రారంభం

సెలవులకు ముందు రోజే ముగియనున్న సమ్మెటివ్-1 పరీక్షలు

2

నా పోటీ హుజూర్‌నగర్ నుంచే.. వదంతులు నమ్మొద్దు : మంత్రి ఉత్తమ్

- వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేసిన ఉత్తమ్
- తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి
- కాళేశ్వరం డిజైన్ లో లోపాలు ఉంటే ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందని వెల్లడి

2

ఫ్లైదుబాయ్ పైలట్ మచ్చర్ సాహసంపై రాహుల్ గాంధీ మౌనం..

- బీజేపీ నేతల తీవ్ర విమర్శలు

- ఫ్లైదుబాయ్ పైలట్ ధైర్యాన్ని పొగడని రాహుల్ గాంధీపై బీజేపీ విమర్శలు
- ప్రాణాలు పణంగా పెట్టిన పైలట్‌పై రాహుల్ ఒక్క పోస్ట్ పెట్టలేదన్న కిషన్ రెడ్డి
- మోదీ పైలట్‌తో మాట్లాడారని, రాహుల్ మౌనంగా ఉన్నారని రామచందర్ రావు వ్యాఖ్య

ఉద్యమపోరు, న్యూ ఢిల్లీ : ఫ్లైదుబాయ్ విమానంలో కో-పైలట్ చేతిలో కత్తిపోట్ల కు గురైనా, ధైర్యంగా విపత్తును నివారించి ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభినందిం చడం లేదంటూ బీజేపీ నేతలు టార్గెట్ చేశారు. పైలట్ ధైర్యాన్ని గుర్తిం చడంలో రాహుల్ విఫలమయ్యారంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "మరో 9/11 తరహా ఘటనను తన ప్రాణాలను పణంగా పెట్టి నివారించిన పైలట్ గురించి రాహుల్ గాంధీ ఒక్క పోస్ట్ కూడా పెట్టలేదు,...

2

రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది : హరీశ్ రావు

- నర్సాపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు
- రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా

ఉద్యమపోరు, మెదక్ : మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు. అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

సీఎన్‌జీ నింపుతుండగా కారులో భారీ పేలుడు.. ఈ 3 జాగ్రత్తలు తప్పక పాటించాలి!

పేలుడుతో దెబ్బతిన్న కారు, సమీప వాహనాలు

ప్రమాదానికి కారణం ఇంకా నిర్ధారణ కాని వైనం

సీఎన్‌జీ నింపేటప్పుడు కారులో ఉండొద్దని సూచన

2

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
ఆదివారం 04.10.2026

తెలంగాణలో సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్ పాసులు!

మొదటిపేజీ తరువాయి.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వృద్ధుల సంక్షేమానికి చేయూత పెన్షన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తోంది. అయితే, మహాలక్ష్మి పథకంతో ఇప్పటికే టీజీఎస్ఆర్టీసీపై ఆర్థిక భారం పడుతున్న నేపథ్యంలో, సీనియర్ సిటిజన్ల ఉచిత ప్రయాణంతో పడే అదనపు భారం, దానిని భర్తీ చేసే మార్గాలపై ప్రభుత్వం సమీక్ష జరుపుతోంది. అన్ని అంశాలను పరిశీలించి, విధివిధానాలు ఖరారు చేసిన తర్వాతే ఈ పథకం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

అమృత్‌సర్‌లో పట్టపగలే కాల్పుల కలకలం.. సోషల్ మీడియా స్టార్ దారుణ హత్య

మొదటిపేజీ తరువాయి.. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, మేకప్ ఆర్టిస్ట్ మధుసూదన్ సంధు అలియాస్ 'మ్యాడ్ సంధు'ని గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. నిన్న సాయంత్రం లోహర్కా రోడ్‌లో ఈ సంఘటన జరగడంతో స్థానికంగా కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. సాయంత్రం 6 గంటల సమయంలో మ్యాడ్ సంధు తన కారును శుభ్రం చేయించేందుకు లోహర్కా రోడ్‌లోని ఓ కార్ వాష్ షాప్‌కు వెళ్లారు. అదే సమయంలో మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆయనపై అతి సమీపం నుంచి కాల్పులు జరిపి పారిపోయారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన సంధును వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. అక్కడ లభించిన ఖాళీ బుల్లెట్ షెల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, నిందితులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని అధికారులు తెలిపారు. తమకు కొన్ని కీలక ఆధారాలు లభించాయని, పలు కోణాల్లో విచారణ జరుపుతున్నామని వెల్లడించారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీను పరిశీలించడంతో పాటు సంధు కుటుంబ సభ్యుల వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. మ్యాడ్ సంధు ఇన్‌స్టాగ్రామ్‌లో మేకప్ ఆర్టిస్ట్రీకి సంబంధించిన కంటెంట్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు సోషల్ మీడియాలో పెద్ద సంఖ్యలో ఫాలోవర్లు ఉన్నారు. అయితే, గతంలో తన వస్త్రధారణ, కొన్ని వీడియోల విషయంలో ఆయన పలు వివాదాలను ఎదుర్కొన్నారు.

తెలంగాణలో దసరా సెలవులు ఖరారు..

పాఠశాలలకు 13 రోజులు, కాలేజీలకు 12 రోజులు

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలోని విద్యార్థులకు దసరా పండుగ సెలవులను రాష్ట్ర విద్యాశాఖ ఖరారు చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వేర్వేరుగా సెలవుల తేదీలను శనివారం ప్రకటించింది. ఈసారి పాఠశాలలకు 13 రోజుల పాటు, ఇంటర్మీడియట్ కళాశాలలకు 12 రోజుల పాటు దసరా సెలవులు రానున్నాయి. విద్యాశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు 13 రోజుల పాటు సెలవులు ఉంటాయి. సెలవుల అనంతరం అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. ఇక జూనియర్ కళాశాలల (ఇంటర్మీడియట్) విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 12 రోజులు సెలవులు ప్రకటించారు. వీరికి అక్టోబర్ 22న తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (SA-1) పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలు అక్టోబర్ 9వ తేదీతో ముగియనున్నాయి. అదే రోజున జరగాల్సిన 9వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష సమయాన్ని అధికారులు మార్చారు. ఈ పరీక్ష ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరుగుతుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి.

నా పోటీ హుజూర్‌నగర్ నుంచే.. వదంతులు నమ్మొద్దు : మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్ సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

వరంగల్ ఎయిర్‌పోర్టు పనుల్లో ముందడుగు..

- బౌండరీ వాల్‌కు టెండర్ ఖరారు

మొదటిపేజీ తరువాయి.. బిడ్ దాఖలు చేసింది. ఇది అంచనా వ్యయం కంటే 37.89 శాతం తక్కువ. దీనివల్ల ప్రభుత్వానికి దాదాపు రూ.8.10 కోట్లు ఆదా కానుంది. కాంట్రాక్టు ప్రకారం, కొత్తగా సేకరించిన 283 ఎకరాల భూమి చుట్టూ ప్రీకాస్ట్ బౌండరీ వాల్ నిర్మించడంతో పాటు, పాత ప్రహరీ ఎత్తును కూడా పెంచనున్నారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) నిబంధనలకు అనుగుణంగా ఈ పనులు జరుగుతాయి. అక్టోబర్ 9న పనులు ప్రారంభించి, 15 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం, అక్టోబర్ 14లోపు సైదాక్ కంపెనీ ప్రతినిధులు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టులోని ఏఏఐ కార్యాలయంలో అధికారిక ఒప్పందంపై సంతకాలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం రూ.285 కోట్లతో భూసేకరణ పూర్తి చేసి ఏఏఐకి అప్పగించిన విషయం తెలిసిందే. ప్రహరీ పనుల తర్వాత టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ వంటి ఇతర ముఖ్యమైన నిర్మాణాలకు కూడా టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. 2028 జూన్ నాటికి ఎయిర్‌పోర్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఫ్లైదుబాయ్ పైలట్ మచ్చర్ సాహసంపై రాహుల్ గాంధీ మౌనం..

- బీజేపీ నేతల తీవ్ర విమర్శలు

మొదటిపేజీ తరువాయి.. మాట్లాడలేదు" అని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా నేతలు పైలట్‌ను అభినందిస్తుంటే గాంధీ కుటుంబం ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పైలట్‌తో వీడియో కాల్‌లో మాట్లాడి అభినందించారని గుర్తు చేశారు. కానీ ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ కనీసం ఈ ఘటనపై స్పందించకపోవడం, ట్వీట్ చేయకపోవడం తేడాను స్పష్టంగా చూపిస్తోందని అన్నారు. ఇదే 'దేశం ప్రథమం' అనే తమ సిద్ధాంతానికి, వారి వైఖరికి ఉన్న వ్యత్యాసమని పేర్కొన్నారు. దేశం మొత్తం పైలట్‌ను ప్రశంసిస్తుంటే రాహుల్ గాంధీ మౌనం అనుమానాస్పదంగా ఉందని పలువురు జాతీయ బీజేపీ అధికార ప్రతినిధులు వ్యాఖ్యానించారు. మరికొందరు నేతలు రాహుల్ వైఖరిని "ఓటు బ్యాంకు రాజకీయాలకు" నిదర్శనమని ఆరోపించారు.

ఇక ఆటోల వంతు.. కామన్ పాస్‌పై సర్కార్ కీలక ప్రకటన!

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ మహానగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే లక్ష్యంతో, ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'కామన్ మొబిలిటీ కార్డు' (కామన్ పాస్) సేవలను త్వరలో ఆటోలకు కూడా విస్తరించాలని యోచిస్తోంది. ప్రస్తుతం మెట్రో, ఆర్టీసీ బస్సులకే పరిమితమైన ఈ పాస్ పరిధిలోకి ఆటోలను కూడా తీసుకురావడం ద్వారా నగరంలో రవాణా వ్యవస్థ స్వరూపాన్నే మార్చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కీలక విషయాన్ని స్వయంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. గురువారం కామన్ పాస్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి భట్టి విక్రమార్క మెట్రో, బస్సుల్లో ప్రయాణించారు. బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు మెట్రోలో, అక్కడి నుంచి సచివాలయం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ.. సాధారణ ప్రయాణికులతో ముచ్చటించారు. పాస్ వినియోగం, సౌకర్యాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "ప్రజలకు సులభమైన, సౌకర్యవంతమైన రవాణా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. ఒకే కార్డుతో అన్ని రకాల ప్రజా రవాణా సేవలను పొందేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. భవిష్యత్తులో ఆటోలు, ఇతర రవాణా సాధనాలను కూడా ఈ కామన్ పాస్‌తో అనుసంధానిస్తాం" అని స్పష్టం చేశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్రజా రవాణాను ప్రోత్సహించడమే మార్గమన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రోజువారీ పాస్ (రూ.400), నెలవారీ పాస్ (రూ.8,500) ధరలపై ప్రయాణికుల నుంచి వస్తున్న స్పందనను నిశితంగా గమనిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా నెలవారీ పాస్ ధర అధికంగా ఉందన్న అభిప్రాయాలపై ఆయన స్పందిస్తూ.. "ప్రయాణికుల నుంచి వచ్చే సూచనలు, సలహాలను స్వీకరించి, వారి స్పందన ఆధారంగా పాస్ ధరలపై తప్పకుండా సమీక్ష జరుపుతాం" అని హామీ ఇచ్చారు. రోజూ పరిమిత దూరం ప్రయాణించే తమకు నెలవారీ పాస్ ధర చాలా భారంగా ఉందని, ప్రస్తుతం అవుతున్న ఖర్చు కంటే ఇది రెట్టింపుగా ఉందని కొందరు ప్రయాణికులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు.

మహారాష్ట్రలో వరుస భూకంపాలు..

రెండు గంటల్లో రెండుసార్లు కంపించిన భూమి

మొదటిపేజీ తరువాయి.. మహారాష్ట్రలోని హింగోలీ జిల్లాలో శనివారం ఉదయం వరుస భూప్రకంపనలు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేశాయి. రెండు గంటల వ్యవధిలో రెండుసార్లు భూమి కంపించడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా విపత్తు నిర్వహణ విభాగం వివరాల ప్రకారం, శనివారం ఉదయం 7.46 గంటలకు ఔంధా నాగనాథ్ తహసీల్ లోని గధాలా గ్రామంలో భూమికి 7 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.3గా నమోదైంది. ఈ ఘటన జరిగిన రెండు గంటల తర్వాత, అదే ప్రాంతంలో 4.5 తీవ్రతతో మరో శక్తిమంతమైన భూకంపం సంభవించింది. రెండోసారి భూమి కంపించడానికి ముందు కొన్ని నిమిషాల పాటు భారీ శబ్దాలు వినిపించాయని పింపల్దరీ, సమీప గ్రామాల ప్రజలు తెలిపారు. ఈ ప్రాంతంలో గత ఆరేళ్లుగా తరచూ భూప్రకంపనలు సంభవిస్తున్నాయి. ఈ ఏడాది జులై 9, 11 తేదీల్లో 4.6, 3.5 తీవ్రతతో భూకంపాలు రావడం, కొన్ని ఇళ్లకు పగుళ్లు ఏర్పడటంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందవద్దని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది.

సీఎన్‌జీ నింపుతుండగా కారులో భారీ పేలుడు..

- ఈ 3 జాగ్రత్తలు తప్పక పాటించాలి!

మొదటిపేజీ తరువాయి.. గుజరాత్‌లోని వడోదర జిల్లాలో సీఎన్‌జీ నింపుతుండగా ఓ కారులో భారీ పేలుడు సంభవించింది. నేషనల్ హైవే-48పై కర్జన్ సమీపంలోని సీఎన్‌జీ స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. పేలుడు ధాటికి కారు పూర్తిగా దెబ్బతినడంతో పాటు సమీపంలోని వాహనాలు, స్టేషన్ పరికరాలు కూడా దెబ్బతిన్నాయి. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. సీఎన్‌జీ నింపే సమయంలో డ్రైవర్ కారుకు దూరంగా ఉండటం, స్టేషన్ సిబ్బంది కూడా సురక్షిత దూరంలో ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. సమీపంలో ఉన్న మరో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. సీఎన్‌జీ కిట్‌లో గ్యాస్ లీకేజీ లేదా సిలిండర్ వాల్వ్‌లో లోపం కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే దర్యాప్తు పూర్తయ్యే వరకు ఏ ఒక్క కారణాన్నీ ఖరారు చేయలేమని అధికారులు చెబుతున్నారు. కారు సీఎన్‌జీ కిట్, సిలిండర్, వాల్వ్‌ల పరిస్థితితో పాటు రీఫ్యూయలింగ్ సమయంలో పాటించిన భద్రతా నిబంధనలను అధికారులు పరిశీలిస్తున్నారు..

సీఎన్‌జీ వాహనదారులు ఈ 3 జాగ్రత్తలు తప్పక పాటించాలి

గ్యాస్ నింపే సమయంలో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు కూడా కారు దిగి సురక్షిత దూరంలో నిలబడాలి. వడోదర ఘటనలో ఇదే ప్రాణనష్టం తప్పించడానికి కీలకంగా మారింది. సర్టిఫైడ్ సీఎన్‌జీ వర్క్‌షాప్‌లో సిలిండర్, వాల్వ్‌లు, పైపులు, కిట్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించాలి. తుప్పు, దెబ్బతినడం లేదా గ్యాస్ వాసన వస్తే వెంటనే నిపుణులను సంప్రదించాలి. సీఎన్‌జీ వ్యవస్థలో అనధికార పరికరాలు అమర్చడం లేదా సొంతంగా మరమ్మతులు చేయడం ప్రమాదకరం. గుర్తింపు పొందిన పరికరాలు మాత్రమే ఉపయోగించాలి. శిక్షణ పొందిన నిపుణులతోనే సీఎన్‌జీ కిట్ పనులు చేయించాలి.

అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మించాలి

- సంవత్సర కాలంగా సెలవులో ఉన్న ఉపాధ్యాయురాలు...
- స్టోర్‌రూమ్, పిల్లలు చదువుకునే గది వేర్వేరుగా ఏర్పాటు చేయాలి..
- జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే వెంటనే చొరవ తీసుకోవాలి..
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్..

ఉద్యమపోరు, జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 03 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా 15వవార్డు కాకతీయ కాలనీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్ డిమాండ్ చేశారు. చిన్నారులకు విద్య, పోషకాహారం, ప్రాథమిక సంరక్షణ అందించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాల్లోనే సరైన భవనాలు,గదులు,తాగునీరు, మరుగుదొడ్లు, స్టోర్‌రూమ్ వంటి సౌకర్యాలు లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రానికి ప్రత్యేకంగా నూతన భవనం నిర్మించాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యపై తగిన స్థాయిలో దృష్టి సారించకపోవడం వల్ల చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నేరెళ్ల జోసఫ్ తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహించాల్సిన ఉపాధ్యాయురాలు సుమారు సంవత్సర కాలంగా సెలవులో ఉన్నారని స్థానికంగా తమ దృష్టికి వచ్చినట్లు నేరెళ్ల జోసఫ్ తెలిపారు.సుదీర్ఘకాలం సిబ్బంది అందుబాటులో లేకపోతే చిన్నారుల విద్యా కార్యకలాపాలు, పోషకాహార కార్యక్రమాలు, రోజువారీ నిర్వహణపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన అన్నారు.ప్రస్తుతం పిల్లలు చదువుకునే గది, స్టోర్‌రూమ్ ఒకే గదిలో ఉండటంతో అక్కడి కార్యకలాపాలు నిర్వహించడం కష్టంగా మారిందని తెలిపారు.చిన్నారులు కూర్చుని చదువుకోవాల్సిన ప్రదేశంలోనే ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని నిల్వ చేయాల్సి రావడం వల్ల స్థలాభావం ఏర్పడుతోందని తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రం అంటే కేవలం పిల్లలను కూర్చోబెట్టి చదివించే స్థలం కాదని, చిన్నారుల ప్రారంభ విద్య, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, మానసిక–శారీరక అభివృద్ధికి పునాది వేసే కేంద్రాలని తెలిపారు.కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

ఎం.పీ.పీ.ఎస్. మహిపాల్ తండా పాఠశాలను సందర్శించి న స్థానిక సర్పంచ్ మల్లెల సాయి చరణ్

ఉద్యమపోరు, నిజామాబాద్ రూరల్ సిరికొండ, అక్టోబర్ 03 : సిరికొండ మండల పరిధిలోని ఎం.పీ.పీ.ఎస్. మహిపాల్ తండా పాఠశాలను శనివారం స్థానిక సర్పంచ్ మల్లెల సాయి చరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధనా తీరు, అలాగే మధ్యాహ్న భోజన నిర్వహణను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మల్లెల సాయి చరణ్ మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవరచుకోవాలని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై శ్రద్ధగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. అప్పుడే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురాగలరని ఆకాంక్షించారు.అనంతరం, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తూ... సమయ పాలనను కచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల చదువు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని కోరారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గ్యామ శోభన్, వార్డు మెంబర్ బాధావత్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కుర్దులిపేటలో శ్మశానవాటిక రహదారి మరమ్మతు పనులు

ఉద్యమపోరు, నిజామాబాద్ రూరల్ సిరికొండ, అక్టోబర్ 03 : కుర్దుల్ పేట గ్రామంలోని శ్మశానవాటిక రహదారికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు శ్మశానవాటికకు వెళ్లే మార్గం తీవ్రంగా దెబ్బతినడంతో, అంతిమ యాత్రలకు వెళ్లే గ్రామ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ప్రజల కష్టాలను గుర్తించిన గ్రామ సర్పంచ్ శ్రీమతి గాండ్ల నవనీత సతీష్ పటేల్ ప్రత్యేక చొరవ తీసుకోని రహదారి మరమ్మతు పనులను చేపట్టారు. ట్రాక్టర్లు, జేసీబీ (JCB) యంత్రాల సహాయంతో మట్టిని తరలించి, రోడ్డును చదును చేసే పనులను వేగవంతం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "గ్రామంలోని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శ్మశానవాటిక మార్గాన్ని రాకపోకలకు అనువుగా సిద్ధం చేస్తున్నాం. గ్రామాభివృద్ధే ధ్యేయంగా, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాం" అని తెలిపారు. రహదారి మరమ్మతు పనులు చేపట్టడంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, సర్పంచ్ నవనీత సతీష్ గారికి ధన్యవాదాలు తెలిపారు.

మొగుళ్ళపల్లి గ్రామ యువతకు సర్పంచ్ చాట్ల విజయ - రవీందర్ విజ్ఞప్తి

ఉద్యమపోరు, మొగుళ్లపల్లి, అక్టోబర్ 03 : మొగుళ్ళపల్లి గ్రామ యువతీ యువకులకు ముఖ్య విజ్ఞప్తిజయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలను అందించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (TASK) ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించబడుతోంది.తేదీ: 9 అక్టోబర్ 2026సమయం: ఉదయం 9:30 గంటల నుంచివేదిక: పుష్ప గ్రాండ్ కన్వెన్షన్, భూపాలపల్లి10,000+ ఉద్యోగ అవకాశాలు

అర్హతలు:
SSC / ITI / ఇంటర్మీడియట్ / డిప్లొమా / ఏదైనా డిగ్రీ / పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు పాల్గొన వచ్చు.మొగుళ్ళపల్లి గ్రామంలోని అర్హత కలిగిన యువతీ యువకులు ఈ ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకొని తమ విద్యార్హతలకు అనుగుణమైన ఉద్యోగ అవకాశాలను పొందేందుకు తప్పక హాజరు కావాలని గ్రామ సర్పంచ్ చాట్ల విజయ–రవీందర్ దంపతులు కోరుతున్నారు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న ప్రతి యువకుడు, యువతి తమ రెజ్యూమ్‌లకు సంబంధించిన పలు కాపీలు తీసుకొని ఈ జాబ్ మేళాకు హాజరు కావాలని విజ్ఞప్తి.“ఉద్యోగ అవకాశాన్ని అందిపుచ్చుకొని మీ భవిష్యత్తుకు మంచి బాట వేసుకోండి”

ఓబీసీ హక్కుల కోసం సింహగర్జన.. కేశంపేట నుంచి భారీగా తరలిరండి

ఉద్యమపోరు, కేశంపేట్లి, అక్టోబర్ 03 : జాతీయ జనగణనలో ఓబీసీ కుల గణన చేపట్టాలనే డిమాండ్‌తో అక్టోబర్ 4న శంషాబాద్ మండలం గొల్లపల్లి రోడ్డులో నిర్వహించనున్న ‘ఓబీసీ సింహగర్జన’ మహాసభకు కేశంపేట మండలం నుంచి భారీగా తరలిరావాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.ఓబీసీల జనాభాను కచ్చితంగా లెక్కించడం ద్వారా జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు మార్గం సుగమం అవుతుందని రమేష్ పేర్కొన్నారు. బీసీల హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాంగ బద్ధమైన ప్రాతినిధ్యం కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.తెలంగాణలో కుల సర్వే నిర్వహించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బీసీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యంపై చర్చ కొనసాగుతున్నదన్నారు. పీసీసీ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో, షాద్‌నగర్ ఎమ్మెల్యే, పీసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.“ఎవరి సంఖ్య ఎంతైతే.. వారికి అంత వాటా” అనే నినాదంతో జరుగుతున్న ఈ మహాసభకు కేశంపేట నుంచి పెద్దఎత్తున తరలివచ్చి ఓబీసీల హక్కుల కోసం తమ గళాన్ని వినిపించాలని రమేష్ కోరారు.

యశోద హాస్పిటల్‌లో క్యాన్సర్ చికిత్సకు ఆధునిక సాంకేతికతతో వైద్య సేవలు : డాక్టర్.భరత్ ఏ.వాస్వాని

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 03 : సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌లోని క్యాన్సర్ విభాగం రోగుల అవసరాలకు అనుగుణంగా సమగ్ర క్యాన్సర్ చికిత్సను అందిస్తోంది అని డాక్టర్.భరత్ ఏ.వాస్వాని శనివారం నిజామాబాద్ లో గల యశోద ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో తెలిపారు.ఆధునిక వైద్య పరీక్షల ద్వారా వ్యాధి పరిస్థితిని అంచనా వేసి,ప్రతి రోగికి తగిన చికిత్సా ప్రణాళికను రూపొందిస్తారు.క్లిష్టమైన క్యాన్సర్ కేసుల్లో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు కలిసి రోగి పరిస్థితిని సమీక్షించి,తగిన చికిత్సా విధానాన్ని నిర్ణయిస్తారు. కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనోథెరపీ, CAR–T సెల్ థెరపీ వంటి ఆధునిక చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయి. క్యాన్సర్‌కు సంబంధించిన అత్యవసర పరిస్థితులను కూడా వైద్య బృందం నిర్వహిస్తుంది. రోగుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని డే-కేర్ కీమోథెరపీ సేవలను కూడా అందిస్తున్నారు.అవసరాన్ని బట్టి రోబోటిక్ సర్జరీ,HIPEC వంటి ఆధునిక చికిత్సా విధానాలను సైతం అందుబాటులో ఉంచారు.ఆధునిక వైద్య సాంకేతికతతో పాటు నిపుణులైన వైద్యుల సమన్వయంతో క్యాన్సర్ రోగులకు వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందించేందుకు యశోద హాస్పిటల్ కృషి చేస్తోంది అని డాక్టర్ భరత్ ఏ.వాస్వాని అన్నారు.మార్కెటింగ్ మేనేజర్ శ్రీరామ్ సురేష్ ఉన్నారు.

మంథని ఆనవాళ్లు లేకుండా చేయాలన్నదే దుద్దిళ్ల శ్రీధర్ ఆలోచన

- మార్కెట్‌ను కూలగొట్టి నాలుగు నెలలైనా తట్టెడు మట్టి తీయలే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్-03 : మంథనిలో ఏ ఆనవాళ్లు లేకుండా చేయాలన్నదే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఆలోచన అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శనివారం మంథనిలో నూతనంగా నిర్మించనున్న వెజ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను ఆయన సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ , పబ్లిక్ హెల్త్ ఈఈ అధికారులతో ఫోన్ మాట్లాడి మార్కెట్ నిర్మాణంలో జాప్యంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దుద్దిళ్ల శ్రీధర్ ఎనిమిదిసార్లు గెలిచి నియోజకవర్గంలోని పిల్లల భవిష్యత్ కోసం వారి జీవితాల కోసం ఒక్కసారి కూడా ఆలోచించలేదన్నారు. కానీ మంథని చరిత్రను రూపుమాపడానికి, ప్రతి దానికి తన తండ్రి పేరు పెట్టుకోవడానికి తన తండ్రే మొత్తమని ఈ సమాజానికి ఇష్టం లేకున్నా అంటగట్టేందుకు చేస్తున్న ప్రయత్నమని ఎద్దేవా చేశారు. దుద్దిళ్ల శ్రీధర్ అనాలోచిత నిర్ణయాలతో మంథని మార్కెట్ ఆనవాళ్లు లేకుండా పోతున్నాయని, మంథని పుట్టినప్పుడే ఈ మార్కెట్ పుట్టిందని, ఈ మార్కెట్ ఆనవాళ్లు ఉండవద్దని, చరిత్ర కనబడనీయవద్దని దుద్దిళ్ల శ్రీధర్ కుట్రలు చేస్తున్నాడని అన్నారు. నాలుగు నెలల క్రితం మార్కెట్ నిర్మాణం కోసం ఉన్న మార్కెట్‌ను డిస్మెంటల్ చేశారని, ఇప్పటి వరకు తట్టెడు మట్టి తీయకుండా ఉండటం అవమానమన్నారు. కమీషన్ రాలేదనో కమీషన్ వచ్చినా ఎన్నికల వరకు కొనసాగించాలనో పనులు ఇంకా మొదలు పెట్టడం లేదని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ఓట్ల కోసం పోతే మా పిల్లలు చదువుకున్నరని, ఒక ఐటీ కంపెనీ, ఇండస్ట్రీ పెట్టలేదని, నీ కుటుంబం మాత్రం వేల కోట్లు సంపాదించుకున్నారని అడుగుతరని ఒకటో రెండో బంగ్లాలు కట్టించి వీటిని చూసి మురిసిపోతరని, ఇలాగే ఎన్నికల వరకు కొనసాగించే కార్యక్రమంగా కనబడుతోందని ఆయన విమర్శించారు. మార్కెట్ నిర్మాణంపై కమీషనర్‌తో మాట్లాడితే డిజైన్స్‌కే సమయం గడిచిపోయిందని చెప్తున్నరని, అంటే నాలుగు నెలలు డిజైన్స్‌కు పోతే కట్టడానికి ఇంకా ఎన్ని ఏండ్లు పడుతుందో ఎమ్మెల్యే అధికార యంత్రాంగం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు ఓట్లు ఉన్న కుటుంబమని ప్రతిసారి చెప్తున్నా అయినా 40ఏండ్లు అవకాశం ఇచ్చినా వారి కష్టాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇంత పెద్ద సమాజంలో కూరగాయాలు అమ్ముకునెటోళ్ల ఎస్సీలు ఎస్టీలు మైనార్టీలు ఉంటరే తప్ప దుద్దిళ్ల కుటుంబానికి చెందిన వాళ్లు ఎవరూ ఉండరు అయినా వాళ్లను ఓర్వకుండా చెట్టుకొకరు పుట్టకొకరిని చేసిందని ఆయన వాపోయారు. వేల కోట్లు సంపాదిస్తున్నా ఓట్లు వస్తే ఓటుకు ఐదు వేలు ఇస్తాననే అహంకారంతో ఉన్నరని అన్నారు. రెండు రోజుల క్రితం కాటారంలోని మార్కెట్ ను సందర్శించడం జరిగిందని, అక్కడ కూడ ఇలాగే వ్యాపారులను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన గురించి మన పిల్లల భవిష్యత్ గురించి, కరెంటు, నీళ్ల గురించి ఏనాడు ఆలోచన చేయలేదన్నారు. కమీషన్‌లు వచ్చాయని కాళేశ్వరం గుడిని కూలగొట్టిన చరిత్ర దుద్దిళ్లదని అన్నారు. వచ్చే ఏడాది పుష్కరాలు వస్తయని, అప్పటిలోగా మార్కెట్ పూర్తి కాకపోతే చిరువ్యాపారులకు తీరని నష్టమే ఉంటుందని ఆయన అన్నారు. ఈ ప్రాంతంతో ఏ సంబంధం లేనోడు ఎమ్మెల్యే అయితే ఎలా ఉంటదో దుద్దిళ్ల శ్రీధర్‌ను చూస్తే అర్థమవుతుందన్నారు. శిలాఫలకం వేసి రెండేళ్లు కావస్తున్నా పనులు చేయకుండా ఇంకా ఏదో గొప్పగా చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన ఎద్దేవ చేశారు. మున్సిపల్ భవనం, ఆసుపత్రి మంచిగా ఉన్నా కూడా కమీషన్ కోసం ఎక్కడెక్కడో కట్టిస్తున్నాడని, పురాతణ ఆనవాళ్లు లేకుండా చేయాలన్నదే దుద్దిళ్ల శ్రీధర్ లక్ష్యమని అర్థం అవుతుందన్నారు. నాలాంటి గరీబోడు ఎదిగితే కళ్లలో కారంపోసుకుని లేనిపోని ఆరోపణలు చేసి ప్రజలకు దూరం చేశాడని, తుది శ్వాస వరకు ప్రజల పక్షాన పోరాటం చేసి దుద్దిళ్ల శ్రీధర్‌కు ప్రజాక్షేత్రంలో పనిస్మెంట్ ఇప్పిస్తానని అన్నారు. తనకు చిన్నప్పటి నుంచే ఈ మార్కెట్‌తో సంబంధం ఉందని, తన తండ్రి ఇక్కడే గొడ్ల అంగడి నడిపేవాడని, ఈ మార్కెట్‌తో పెనవేసుకుని పెరిగానని, అందుకే ఈ ఆందోళన అని ఆయన అన్నారు. తండ్రి ఆశయాలని పదేపదే చెప్తున్న ఎమ్మెల్యే ప్రజలను ఇబ్బంది పెట్టడం, వ్యాపారులను ఎటు కాకుండా చేయడమేనా అని ప్రశ్నించారు. మీ నాయన పేరు అసెంబ్లీకి పెట్టుకున్నవ్ కదా...జయంతి వర్థంతిలను ప్రభుత్వపరంగా జరుపుకుంటున్న మంథని ఎమ్మెల్యే చేతిలో ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉన్నా నలుగురికి ఉద్యోగాలు ఇప్పించని ఘనుడని ఆన్నారు. ఒకవైపు 80ఏండ్ల స్వాతంత్ర్యాన్ని గొప్పగా జరుపుతుంటే మరోవైపు తాము ఆకలితో అలమటిస్తున్నామని, 40ఏండ్ల అయ్యా కొడుకుల పాలన ప్రజలకు పనిస్మెంట్‌లా ఉందన్నారు. ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే, అధికార యంత్రాంగం మార్కెట్ పనులు ఎందుకు మొదలుపెట్టలేదో జవాబు చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

శుభప్రదమ్ అతిపెద్ద ఎగ్జిబిషన్ సేల్ ఘనంగా ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన అషు రెడ్డి

ఉద్యమపోరు, నాగోల్, అక్టోబర్ 03 : నాగోల్ బండ్లగూడ పరిసర ప్రాంత ప్రజలకు పండుగ వాతావరణం నెలకొంది.నాగోల్ నుండి బండ్లగూడ వెళ్లే మార్గంలో ఉన్న పిఎంఆర్ కన్వెన్షన్ హాల్ లో "శుభప్రదమ్" షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఏర్పాటు చేసిన అతిపెద్ద ఎగ్జిబిషన్ సేల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ తార అషు రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్బంగా అషు రెడి మాట్లాడుతూ.. నాగోల్, బండ్లగూడ పరిసర ప్రాంతాల ప్రజలందరి కోసం 'శుభప్రదమ్' షాపింగ్ మాల్ నిర్వాహకులు ఇంతటి భారీ ఎగ్జిబిషన్ సేల్‌ను నాగోల్ ప్రజల కోసం తీసుకురావడం నిజంగా చాలా సంతోషంగా ఉందని అన్నారు . ఒకే చోట అన్ని రకాల వస్తువులు, పండుగ షాపింగ్ వెరైటీలు అందుబాటులో ఉండటం మహిళలకు, కుటుంబాలకు చాలా పెద్ద ఉపయోగమని పేర్కొన్నారు.ఇక్కడి కలెక్షన్, క్వాలిటీ ప్రత్యేక ఆఫర్లు నిజంగా అద్భుతంగా ఉన్నాయి.ఈ ఎగ్జిబిషన్ అక్టోబర్ 2 నుండి 18 వరకు కొనసాగుతుందని పరిసర ప్రాంత మహిళలందరు తప్పకుండా వచ్చి ఈ బంపర్ ఆఫర్లను ఉపయోగించుకోవాలని, మీ పండుగ షాపింగ్‌ను ఇక్కడే సరదాగా పూర్తి చేసుకోవాలని కోరారు.అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ.. పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలలో, నాణ్యమైన ఉత్పత్తులతో ఈ ఎగ్జిబిషన్ సేల్‌ను నాగోల్ బండ్లగూడ ప్రాంతంలో తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రారంభోత్సవం రోజున షాపింగ్ ప్రియుల నుంచి విశేష స్పందన లభించిందని, అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 18 వరకు ఈ ప్రదర్శన ఉదయం నుండి రాత్రి వరకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.పరిసర ప్రాంత ప్రజలు అతిపెద్ద ఎగ్జిబిషన్ సేల్ ను సందర్శించి కొనుగోలు చేయగలరని కోరారు.మరిన్ని వివరాలకు లేదా సమాచారం కోసం 89777 33054 నెంబర్ ను సంప్రదించవచ్చు అని తెలిపారు.

చికిత్స కోసం రూ.3 లక్షల ఎల్ఓసీ అందజేత

- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్ 03 : మంథని మండలంలోని ఖానాయి పేట గ్రామానికి చెందిన మెరుగు రాజయ్య నిమ్స్ ఆసుపత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు తెలుపగా వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి 3 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. చికిత్స కోసం 3 లక్షల ఎల్ఓసీ మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబుకు వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పారదర్శక ఓటరు జాబితా కోసం పకడ్బందీగా ఎస్.ఐ.ఆర్ అమలు

- ఎన్నికల జాబితా పరిశీలకులు టీ.కే.శ్రీదేవి
- పోలింగ్ కేంద్రాల సందర్శన
- ఈ.ఆర్.ఓలు,రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 03 : అర్హత కలిగిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు హక్కు కలిగి ఉండేలా తుది ఓటరు జాబితా రూపొందేలా సమిష్టిగా కృషి చేయాలని ఎన్నికల జాబితా పరిశీలకులు,రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా,పట్టణ ప్రణాళికా విభాగం సంచాలకులు టీ.కే.శ్రీదేవి సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో కీలకమైనందున అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా తప్పిపోకుండా,అదే సమయంలో అనర్హులకు జాబితాలో చోటు లేకుండా ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.శనివారం ఆమె ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ జి.లహరి,అదనపు కలెక్టర్ వి.భుజంగరావు,ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాలతో కలిసి ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని మామిడిపల్లిలో గల 39వ పోలింగ్ స్టేషన్ ను,ఆర్మూర్ లోని 88వ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఎస్.ఐ.ఆర్ అమలు తీరు గురించి,వాటి వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేసిన విధానాన్ని నిశితంగా పరిశీలన జరిపారు.ఎంతమందికి నోటీసులు ఇచ్చారు,ఎన్ని హియరింగ్ లు పూర్తయ్యాయి,ఎలా విచారణ జరుపుతున్నారు,ఏయే ధృవీకరణ పత్రాలను స్వీకరించారు,ఎంత మంది అన్ మ్యాపింగ్ ఓటర్లు ఉన్నారు,అనామలిస్ జాబితాలో ఉన్న ఓటర్లు ఎంతమంది తదితర వివరాలను బీ.ఎల్.ఓలు రాంశంకర్,ప్రవళికలను అడిగి తెలుసుకున్నారు.ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ సక్రమంగా నమోదు చేయడం పట్ల ఎన్నికల జాబితా పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో నిజామాబాద్ జిల్లా పరిధిలోని ఆర్మూర్,నిజామాబాద్ అర్బన్,నిజామాబాద్ రూరల్,బోధన్,బాల్కొండ,బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల నమోదు అధికారులతో (ఈ.ఆర్.ఓ),గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల జాబితా పరిశీలకులు టీ.కే.శ్రీదేవి సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఒక్కో నియోజకవర్గం వారీగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరుతెన్నుల గురించి ఈ.ఆర్.ఓలను అడిగి తెలుసుకున్నారు.నిజామాబాద్ అర్బన్ సహా మరికొన్ని సెగ్మెంట్లలో అన్ మ్యాపింగ్,అనామలిస్ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడాన్ని గమనించిన పరిశీలకులు,అందుకు గల కారణాలను కేటగిరీ వారీగా వివరిస్తూ సమగ్ర జాబితాను సమర్పించాలని ఆదేశించారు.హియరింగ్ ప్రక్రియను పారదర్శకంగా,పకడ్బందీగా నిర్వహించాలని,క్షేత్రస్థాయిలో బీ.ఎల్.ఓల పనితీరును పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఈ.ఆర్.ఓలకు సూచించారు.డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని,తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బీ.ఎల్.ఓలు సమయ పాలన పాటిస్తూ,ఓటర్లకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.రాజకీయ పార్టీల ప్రతినిధులను ఉద్దేశించి పరిశీలకులు మాట్లాడుతూ....ఎన్నికల సంఘం నియమ,నిబంధనలు తు.చ తప్పకుండా పాటిస్తూ,పక్కాగా ఓటరు జాబితా రూపకల్పన జరిగేలా తోడ్పాటును అందించాలన్నారు.ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా క్రియాశీలక పాత్ర పోషిస్తూ,పూర్తి సహకారం అందించాలని కోరారు.ఎక్కడైనా పొరపాట్లు,తప్పిదాలను గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తేవాలని సూచించారు.ఓటరు జాబితా రూపకల్పన బాధ్యత కేవలం అధికార యంత్రాంగం,ఎన్నికల సంఘంది మాత్రమే అని భావించకుండా,అందరూ భాగస్వాములైనప్పుడే నిజమైన పారదర్శక జాబితా రూపొందుతుందని అన్నారు.రాజకీయ పార్టీల తరపున బీ.ఎల్.ఏలు క్షేత్రస్థాయిలో బీ.ఎల్.ఓలతో కలిసి సమన్వయంతో పనిచేస్తూ,అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా,అదే సమయంలో అనర్హుల పేర్లు తొలగించబడేలా అంకిత భావంతో కృషి చేయాలని,ఈ బాధ్యతను బృహత్తర కార్యంగా భావిస్తూ సమర్థవంతంగా నిర్వర్తించాలని హితవు పలికారు.సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు,ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా,నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,నిజామాబాద్,బాన్సువాడ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్,రవీందర్,కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు,ఏఈఆర్ఓ లు,సంబంధిత శాఖల అధికారులు,గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గడిపెల్లి శ్రీనివాస్‌కు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అభినందనలు

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్ 03 : మంథని పట్టణంలోనీ మైత్రీ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా గెలుపొందిన గడిపెల్లి శ్రీనివాస్‌ను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అభినందించారు. రెండు రోజుల క్రితం జరిగిన మైత్రీ ఆటో యూనియన్ ఎన్నికల్లో శ్రీనివాస్ విజయం సాధించారు. ఈక్రమంలో శనివారం పట్టణంలోని రాజ గృహాలో శ్రీనివాస్‌ను మాజీ ఎమ్మెల్యే అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. మైత్రీ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా ఆటో డ్రైవర్‌ల సమస్య పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని, యూనియన్‌కు అండగా ఉంటానని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ రాజు గౌడ్, నాయకులు గోబ్బరి వంశీ, గట్టయ్య, శంకర్ గౌడ్, అటో డ్రైవర్ లు రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనంలో కొత్త విధానం

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్ 03 పరీక్షల సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ఎస్ఏ–1, ఎస్ఏ–2 పరీక్షలకు సంబంధించి బాహ్య మూల్యాంకన విధానాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన తొమ్మిది జిల్లాల్లో ఆరో తరగతికి , అన్ని (33)జిల్లాల్లో తొమ్మిదో తరగతికి బాహ్య మూల్యాంకనం నిర్వహించాలని నిర్ణయించింది.ఈ క్రమంలో మంథని మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థుల ఎస్ఏ–1 గణిత సమాధాన పత్రాల బాహ్య మూల్యాంకన ప్రక్రియను శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఎంఈఓ దాసరి లక్ష్మి , ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, చీఫ్ ఎగ్జామినర్ (సీఈ) గీట్ల భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో మూల్యాంకన శిబిరం నిర్వహించారు.ఈ బాహ్య మూల్యాంకనంలో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఎల్. శ్రీనివాస్, గుంజపడుగ ఉన్నత పాఠశాల నుంచి స్వామి, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఎస్. శ్రీనివాస్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి సీహెచ్. శ్రీనివాస్, బి. విజయ్‌కుమార్ తదితరులు సమాధాన పత్రాలను మూల్యాంకనం చేశారు.బాహ్య మూల్యాంకనంతో విద్యార్థుల ప్రతిభను మరింత నిష్పక్షపాతంగా అంచనా వేయడంతో పాటు, పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని గుర్తించి, అవసరమైన విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఈ విధానం దోహదపడుతుందని తెలిపారు.

రోడ్ డివైడర్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఉద్యమపోరు, మహేశ్వరం, అక్టోబర్ 03 : మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హోమ్స్ కాలనీ నుంచి గాంధీనగర్ చౌరస్తా వరకు చేపట్టనున్న రోడ్ డివైడర్ పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారు శంకుస్థాపన చేశారు.ప్రధాన రహదారిపై ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రహదారి భద్రత మరియు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ఈ రోడ్ డివైడర్ పనులను చేపడుతున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు మరియు పలువురు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గురుదక్షిణ"సంపాదకులకు తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకుల అభినందనలు

ఉద్యమపోరు, హైదరాబాద్, అక్టోబర్ 03 : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజం విద్యార్థులు సంపాదకులుగా వ్యవహరించి తీర్చిదిద్దిన గురుదక్షిణ కవితా సంకలనానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఐఏఎస్ ఏనుగు నరసింహారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంజిబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రచురితమైన ఈ కవితా సంకలనం గురువుల గొప్పదనాన్ని చాటేలా ఉందని ఆయన కొనియాడారు. విద్యార్థి దశలోనే సంపాదకులుగా వ్యవహరించడం గొప్ప విషయం అన్నారు. కవితలే కాకుండా సమాజాన్ని మేలుకొల్పేలా ఉండే మరిన్ని రచనలు కూడా చేయాలని సంపాదకులు కొండూరి కోటి బాబు, ఎస్ కళ్యాణ్ దాస్, నాగుల ఆంజనేయులు (అంజిబాబు)కు సూచించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 60 మంది కవులు గురువు ఔన్నత్యాన్ని తెలియజేస్తూ కవితలను రాయడం మంచి పరిణామం అన్నారు. జర్నలిజం విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని మిగతా విద్యార్థులు కూడా ఇతర రంగాల్లో తమ ప్రతిభను చాటాలని సూచించారు. కళలు ప్రతిభలు ప్రతి వ్యక్తిలోనూ దాగి ఉంటాయని, వాటిని వ్యక్తిగత ప్రయోజనాలతో పాటు సమాజానికి తోడ్పడేలా రచనలు చేయవలసిన అవసరం ఉందని. ఆదర్శవంతమైన రచనలు లక్ష మెదళ్లను కదిలించేలా పనిచేస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి ఉత్సాహవంతులైన, ప్రతిభావంతులైన విద్యార్థుల నుంచి మరికొన్ని ఉత్తమ రచనలు ఆశిస్తున్నానని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్ రవీంద్రభారతి ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుల వారి కార్యాలయంలో గురుదక్షిణ కవితా సంకలన సంపాదకులు కొండూరి కోటి బాబు, ఎస్ కళ్యాణ్ దాస్. అంజిబాబు ఫౌండేషన్ ప్రతినిధి నాగుల ఆంజనేయులు (అంజిబాబు)మర్యాదపూర్వకంగా కలిసి గురుదక్షిణ పుస్తకాన్ని అందజేసి ముందుమాట రాసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా గజ్వేల్ పట్టణంలో రక్తదాన శిబిరం..

- **రక్తదానం – ప్రాణదానం" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి**

ఉద్యమపోరు, గజ్వేల్, అక్టోబర్ 03 : గజ్వేల్: భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా "సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమంలో భాగంగా, గజ్వేల్ భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షులు గడియారం రాజేశ్వర్ చారి ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని పీవీ నరసింహారావు బ్లడ్ బ్యాంక్ సెంటర్లో శనివారం ఒక రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి ప్రజాసేవకు 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సమాజానికి ఉపయోగపడే విధంగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. "రక్తదానం – ప్రాణదానం" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ బిజెపి సీనియర్ నేత యెల్లు రాంరెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, 4వ వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు చేప్యాల వెంకట్ రెడ్డి, గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ కుమార్, జిల్లా ఎండోమెంట్ సెల్ కన్వీనర్ కాశమైన సందీప్ కుమార్ పాల్గొన్నారు. అలాగే బిజెపి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సిల్వేరి కుంకుమ రాణి, జిల్లా ఉపాధ్యక్షురాలు అలేటి సుమతి, జిల్లా కార్యవర్గ సభ్యులు స్వరాజ్య లక్ష్మి , గజ్వేల్ పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంతూరి మమత, ఐటీ సెల్ కన్వీనర్ సందిరి రాజు, చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షుడు వలన్దాస్ సత్యనారాయణ, బీజేవైఎం నాయకులు అభినాష్, టంగుటూరి బాబు, టంగుటూరి అనిల్ తదితరులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

నిబంధనలకు అనుగుణంగానే సరోగసీకి అనుమతులు

- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్**

ఉద్యమపోరు, మేడ్చల్, అక్టోబర్ 03 : సరోగసీ ప్రక్రియలో చట్టబద్ధత, పారదర్శకత, వైద్య ప్రమాణాలతో పాటు తల్లీబిడ్డల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ స్పష్టం చేశారు. ఆయన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి ఏఆర్టీ, సరోగసీ బోర్డు సమావేశంలో మొత్తం ఐదు దరఖాస్తులను పరిశీలించి, మూడింటికి ఆమోదం తెలుపుతూ వైద్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేశారు. సరోగసీ (నియంత్రణ) చట్టం–2021 నిబంధనల ప్రకారం దరఖాస్తుదారుల అర్హతలు, వైద్యపరమైన అవసరాలు, సంబంధిత పత్రాలను సమగ్రంగా పరిశీలించినట్లు తెలిపారు. సరోగసీ ప్రక్రియలో అక్రమాలు, దుర్వినియోగం, వాణిజ్య ప్రయోజనాలకు తావు లేకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన దంపతులకు పూర్తిస్థాయి వైద్య, చట్టపరమైన పరిశీలన అనంతరమే ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని వెల్లడించారు. సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవీలత, శిశు వైద్య నిపుణుడు డాక్టర్ శివకిరణ్ పాల్గొన్నారు.

పినపాక తహసిల్దార్ కు ఏజెన్సీ దళిత నేతల సన్మానం

ఉద్యమపోరు, పినపాక, అక్టోబర్ 03 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , పినపాక మండలానికి నూతన తహసిలార్ గా బాధ్యతలు స్వీకరించిన ఆప్కా రమేష్ ను ఏజెన్సీ దళిత హక్కుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోంపల్లి తిరుపతి ఆధ్వర్యంలో సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.మండలంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అర్హులైన వారికి పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని సంఘం నాయకులు తహసీల్దార్‌ను కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా పాలనా సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నిబంధనల మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తానని, అర్హులైన దళితులకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటానని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ దళిత సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్శిటీలో ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ సభ కార్యక్రమం

- **ముఖ్యఅతిథిగా హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

ఉద్యమపోరు, కూకట్పల్లి, అక్టోబర్ 03 : అక్టోబర్ 03, 2026 సంవత్సరం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్శిటీ ఆధ్వర్యంలో నాంపల్లి, హైద్రాబాద్ లో జరిగిన ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ సభకు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగా హాజరైనారు. చిత్రలేఖన విభాగంలో ఎంపికైన కూరెళ్ళ శ్రీనివాస్ ని రూ. 30,116/– ల పారితోషికం తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన కవులు కళాకారులను తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ లలోని 12 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ వెలుదండ నిత్యానంద రావు అధ్యక్షత వహించారు. నల్లగొండకు చెందిన కూరెళ్ల శ్రీనివాస్, (విశ్రాంత ప్రధానోపాధ్యాయులు) చిత్రకళా రంగంలో చేసిన సేవలకు గాను ఈ పురస్కారం వరించింది. రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తకాలకు మరియు అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు, వయోజన విద్య కార్యక్రమాలకు గీసిన చిత్రాలకు,పాఠశాలలో చేసిన కృషికి గాను ప్రతిభా పురస్కారం అందుకున్నారు.

మున్నూరు కాపు నగర నూతన కమిటీకి స్వాగతం : శెట్టి

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 03 : ఖమ్మం నగర మున్నూరు కాపు కమిటీ అధ్యక్షులుగా మాజీ కార్పొరేటర్ రాపర్తి శరత్ కుమార్, కార్యదర్శిగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎగుమతి శాఖ కార్యదర్శి భైరిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారిగా గంగిశెట్టి శ్రీనివాసరావులను ఎన్నుకున్నకోవడం జరిగింది.ఈ ఎంపిక ప్రక్రియ పెద్దలు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు జిల్లా ట్రస్టు బోర్డు కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య జిల్లా మహిళా అధ్యక్ష కార్యదర్శులు పగడాల మంజుల–తోట సుజలరాణి పెద్దలు తాళ్లూరి హనుమంతరావు , మేకల శ్రీనివాస రావు,పసుపులేటి నాసరయ్య, తాళ్లూరి సోమయ్య , కార్పొరేటర్ లు పాలేపు వెంకట రమణ, చామకూరి వెంకట నారాయణ, గోళ్ళ వెంకట్, మదూరు ప్రసాదు, వెన్న పండు, దేవిశెట్టి వెంకటేశ్వర్లు, సి హెచ్ విప్లవ కుమార్ తదితరుల సమక్షంలో జరిగింది.నూతన అధ్యక్ష కార్యదర్శి లు మాట్లాడుతూ తమ మీద ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామని విద్యా, వైద్యం ఇతర అవసరాల్లో పేద మున్నూరు కాపులకు అండగా ఉంటామని పెద్దలు కీర్తి శేసులు మేకల సంగయ్య, మలిశెట్టి వరదయ్య, కనకం సత్యం మరియు రాపర్తి రంగారావుల ఆదర్శాలు, వారి పోరాటాలు గుర్తు ఉంచుకొని వారి అడుగుజాడల్లో నడుస్తామని తెలిపారు.

పైలట్ స్మిత్ మచ్చర్ కు త్రివేణి ఎన్‌సీసీ కేడెట్ల బిగ్ సెల్యూట్

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబరు 03, : సాహసం, సమయస్ఫూర్తితో 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ కు ఖమ్మంలోని త్రివేణి పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు ఘనంగా అభినందనలు తెలిపారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేడెట్లు ఆయనకు సెల్యూట్ చేసి తమ గౌరవాభిమానాలను చాటుకున్నారు.విమానంలో అత్యవసర పరిస్థితి ఏర్పడిన వేళ, కెప్టెన్ స్మిత్ మచ్చర్ తీవ్ర గాయాలైనప్పటికీ చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికులను సురక్షితంగా కాపాడారు. ఆయన చూపిన అసామాన్య ధైర్యసాహసాలు, బాధ్యతాయుత ప్రవర్తన దేశంలోని యువతకు, ముఖ్యంగా ఎన్‌సీసీ కేడెట్లకు ఎంతో స్ఫూర్తిదాయకమని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి కొనియాడారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఆపద సమయంలో భయపడకుండా సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోవడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి. కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రదర్శించిన వీరత్వం, సమయస్ఫూర్తి సమాజానికి ఎంతో ఆదర్శం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థులు పాల్గొని పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ సాహసకృత్యాన్ని ప్రశంసించారు.

ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ కరెంటు కష్టాలు రానివ్వం

- **యూనిట్ కు రూ.12 పెట్టి కొనేందుకైనా సిద్ధంగా ఉన్నాం**
- **ప్రత్యామ్నాయంగా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులపై దృష్టి**
- **గత పాలకుల మాదిరి మాది దొరల ప్రభుత్వం కాదు.. పేదోడి ప్రజా ప్రభుత్వం**
- **మొదటి విడతలో 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేశాం**
- **రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
- **నేలకొండపల్లి మండలం కట్టుకాచారంలో పాలేరు వాగుపై చెక్ డ్యామ్ ప్రారంభోత్సవం**
- **31 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్ ల పంపిణీ**

ఉద్యమపోరు, ఖమ్మం, నేలకొండపల్లి, అక్టోబర్ 03 : దేశవ్యాప్తంగా, ప్రధానంగా మన తెలంగాణ రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రజలకు కరెంట్ కష్టాలు రానివ్వకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నేలకొండపల్లి మండలం కట్టుకాచారంలో రూ. 6.65 కోట్లతో పాలేరు వాగు పై నిర్మించిన చెక్ డ్యామ్ ను, వట్టుకుంట వాగు వరకు రూ. 2.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ దివాకర.టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నేలకొండపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన ఈ చెక్ డ్యామ్ ద్వారా నేలకొండపల్లి మండలం తో పాటు, సమీప కోదాడ మండలానికి కూడా సాగునీరు అందుతుందని తెలిపారు.

సాగు, తాగునీటి కొరత రానీయకుండా చూశాం

ఎల్ నినో ప్రభావం తాండవిస్తున్నా తాగు, సాగునీటి కొరత పరిస్థితులు రానీయకుండా చూసామని అన్నారు. ఇటీవలి తుఫానుతో కొంత మేలు జరిగిందని తెలిపారు. విద్యుత్ కొరత రానీయకుండా అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి యూనిట్ కు రూ.12 చొప్పున కొనేందుకైనా సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. అలాగే ప్రత్యామ్నాయంగా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులపై కూడా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ కొరత పరిష్కారంపై.. ఇటీవలి కేబినెట్ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు.

గతంలో దొరల ప్రభుత్వం, మాది పేదోడి ప్రజా ప్రభుత్వం

గత పాలకులు దొరల ప్రభుత్వాన్ని నడిపించారని, తమది పేదోడి పక్షాన నిలిచే ప్రజా ప్రభుత్వమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. సన్న బియ్యం, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను పేదోడి గడప వరకు చేర్చామని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల చిరకాల కల అయిన సొంతింటిని ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సాధ్యం చేశామని తెలిపారు. మొదటి విడతలో 2.25 లక్షల ఇళ్లు పూర్తి చేశామని, రెండో విడత కూడా కేటాయించామని, ఒక హైదరాబాద్ లోనే లక్ష ఇళ్లు కేటాయించామని స్పష్టం చేశారు. గత పాలకుల మాదిరిగా, తమది దొరల ప్రభుత్వం కాదని, పేదోడి పక్షాన నిలిచే ప్రజా ప్రభుత్వమని, అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యమని వివరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొడాలి గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు నెల్లూరి భద్రయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొందయ్య, బచ్చలికూర నాగరాజు, సర్పంచ్ సైదులు, పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచులు, నాయకులు, పాల్గొన్నారు.

పైలట్ స్మిత్ మచ్చర్ కు త్రివేణి ఎన్‌సీసీ కేడెట్ల బిగ్ సెల్యూట్



ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబరు 03 : సాహసం, సమయస్ఫూర్తితో 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ కు ఖమ్మంలోని త్రివేణి పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు ఘనంగా అభినందనలు తెలిపారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేడెట్లు ఆయనకు సెల్యూట్ చేసి తమ గౌరవాభిమానాలను చాటుకున్నారు.విమానంలో అత్యవసర పరిస్థితి ఏర్పడిన వేళ, కెప్టెన్ స్మిత్ మచ్చర్ తీవ్ర గాయాలైనప్పటికీ చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికులను సురక్షితంగా కాపాడారు. ఆయన చూపిన అసామాన్య ధైర్యసాహసాలు, బాధ్యతాయుత ప్రవర్తన దేశంలోని యువతకు, ముఖ్యంగా ఎన్‌సీసీ కేడెట్లకు ఎంతో స్ఫూర్తిదాయకమని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి కొనియాడారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఆపద సమయంలో భయపడకుండా సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోవడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి. కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రదర్శించిన వీరత్వం, సమయస్ఫూర్తి సమాజానికి ఎంతో ఆదర్శం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థులు పాల్గొని పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ సాహసకృత్యాన్ని ప్రశంసించారు.

పారదర్శకతకు పెద్దపీట కేఎంసి - ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ విధానం అమలు

- **ఉద్యోగుల హాజరు నమోదు కోసం ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా అటెండెన్స్ విధానం ప్రారంభం**

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 03 : ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉద్యోగుల హాజరు నమోదులో మరింత పారదర్శకత, సమయపాలన తీసుకురావడానికి కేఎంసి – ఎఫ్ ఆర్ ఎస్ అటెండెన్స్ విధానాన్ని ఈరోజు నుంచి అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 10:00 గంటల నుంచి 10:30 గంటల వరకు నగర పాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న పర్మినెంట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ మొబైల్ ఫోన్లలో ఎఫ్ ఆర్ ఎస్ యాప్ ద్వారా ఫేస్ రికగ్నిషన్ ఆధారంగా హాజరును నమోదు చేసుకున్నారు. ఈ విధానం ద్వారా ప్రతి ఉద్యోగి ఏ సమయానికి విధులకు హాజరయ్యారు, ఏ సమయానికి విధులు ముగించి వెళ్లారు అనే వివరాలు ఖచ్చితంగా నమోదు కానున్నాయి. దీంతో హాజరు నమోదులో పారదర్శకత పెరగడంతో పాటు ఉద్యోగుల్లో సమయపాలన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణ మరింత మెరుగుపడుతుంది.అలాగే ఉద్యోగుల హాజరు వివరాలను డిజిటల్ విధానంలో నిర్వహించడం ద్వారా మాన్యువల్ అటెండెన్స్‌లో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించి, సమయాన్ని ఆదా చేయడంతో పాటు పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ ఎఫ్ ఆర్ ఎస్ విధానం ఉపయోగపడనుంది.ఉద్యోగులందరూ ఎఫ్ ఆర్ ఎస్ యాప్‌ను సక్రమంగా వినియోగిస్తూ, నిర్ణీత సమయానికి విధులకు హాజరై తమ అటెండెన్స్‌ను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని అభినంధించిన పోలీస్ కమిషనర్

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 03 : సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 01, 2026 వరకు హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ (టిఎస్పిఎ) లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ 5 వ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2026లో షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్ (గెజిటెడ్ ఆఫీసర్ క్యాటగిరిలో) తదితర క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచి బంగారు, వెండి, కాస్యం పతకాలతో ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌కు గుర్తింపు తీసుకొచ్చినఅడిషనల్ డీసీపీ లు కుమారస్వామి, విజయబాబు, హెడ్ కానిస్టేబుల్ బి. దాసు, కానిస్టేబుల్ యండి. ఫైయాజ్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.క్రీడల్లో ప్రతిభ కనబరచడం ద్వారా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని కమిషనర్ పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవడం ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని తెలిపారు.భవిష్యత్తులోనూ క్రీడా పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని పోలీసు సిబ్బందికి పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు.

ఇందాతండా గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

ఉద్యమపోరు, ఖమ్మం, కొత్తగూడెం, అక్టోబర్ 03 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున ఇల్లందు సబ్‌డివిజన్ పోలీసు సిబ్బంది, టీజీఎస్పీ సిబ్బందితో కలిసి కొమరారం గ్రామపంచాయతీ పరిధిలోని ఇందాతండా గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర వ్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. 30 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోల ధ్రువపత్రాలు పరిశీలించి సరియైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గుర్తించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి వంటి అక్రమ మాదకద్రవ్యాల విక్రయాలు, నిల్వలు, గుడుంబా తయారీ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు, విలువైన, విశ్వసనీయ సమాచారాన్ని అందించిన వారికి తగిన ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, టీజీఎస్పీ సిబ్బంది కలిపి మొత్తం 60 మంది పోలీసులు పాల్గొన్నారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
ఆదివారం 04.10.2026

ఏపీకల్ సాఫ్ట్వేర్‌కు 21 మంది శ్రీ చైతన్య విద్యార్థులు ఎంపిక

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 03 : పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఏపీకల్ సాఫ్ట్వేర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 21 మంది విద్యార్థులు జూనియర్ సాఫ్ట్వేర్ ఇంజినీర్లుగా ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.4.80 లక్షల వేతనం అందనున్నట్లు కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక తెలిపారు.ఈ సందర్భంగా ఏపీకల్ సాఫ్ట్వేర్ సంస్థ హెచ్ఆర్ సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తక జ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కోడింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. నిరంతర అభ్యాసమే విజయానికి ప్రధాన సాధనమని పేర్కొన్నారు.సంస్థ టెక్నికల్ హెడ్ కవిత మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ, క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యాలు అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ కళాశాల నుంచి మరింత మంది ప్రతిభావంతులను ఎంపిక చేసుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ యాజమాన్యం విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల రికార్డు స్థాయిలో ప్రాంగణ నియామకాలు జరుగుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.కళాశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ వంద శాతం ప్లేస్‌మెంట్లు సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థులను ప్లేస్‌మెంట్ అవకాశాలకు సిద్ధం చేసేందుకు మాక్ ఇంటర్వ్యూలు, సాంకేతిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ వి. సుదర్శన్, టి.పి.ఓ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, డిప్లొమా ఇన్‌చార్జి కృష్ణ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అన్నప్రసన వేడుకలు

ఉద్యమపోరు, తిరుమలాయ పాలెం, అక్టోబర్ 3 : తిరుమలాయపాలెం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని జల్లేపల్లి, హైదర్ సాయిపేట గ్రామాలలో శనివారం నాడు పోషణ మాసోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అన్న ప్రసన కార్యక్రమం సాంప్రదాయ పద్ధతిలో వేడుకగా చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ అన్నపర్తి రవి మాట్లాడుతూ చిన్న పిల్లలకు అన్న ప్రసన కార్యక్రమం చేయటం చాలా ఆనందంగా ఉందని అదేవిధంగా చిన్నపిల్లలకు బాలింతలు,గర్భిణీలు మంచి పోషకాహారం తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ సత్యనారాయణమ్మ, ఆరోగ్య సిబ్బంది మానస,పార్వతి అంగన్వాడీ టీచర్లు పద్మ, మలుసూరమ్మ , హైదర్ సాయిపేట సర్పంచ్ చీమల నాయక్, అంగన్వాడీ టీచర్లు రజిని, సుశీల, గ్రామస్తులు తురక వేణు, ఆశ కార్యకర్తలు వీరమ్మ,కవిత, ఆయ ముత్తమ్మ గర్భిణీలు, బాలింతలు స్వాతి,శ్రావణి, లావణ్య, మమతా, శైలజ, సునీత తదితరులు పాల్గొన్నారు.గోలు తండా, గోపాయిగూడెం, జింకలగూడెం, గోల్ తండా, గోపాయగూడెం జింకలగూడెం అంగన్వాడి కేంద్రాలు శుక్రవారం నాడు గోల్ తండా అంగన్వాడి కేంద్రం నందు పోషణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రసాన వేడుక చేశారు. ఈ కార్యక్రమంలో గోల్ తండా గ్రామ సర్పంచ్ బానోతు సుజాత, అంగన్వాడి సూపర్వైజర్ టి సావిత్రి, హెడ్మాస్టర్ సుచరిత, గ్రామ కార్యదర్శి రాజుకుమార్, అంగన్వాడీ టీచర్లు ఆశా కుమారి, షరీఫా,సుగుణమ్మ, గర్భిణీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి పర్యటన

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 03 : రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆదివారం పర్యటించనున్నారు. తొలుత ఉదయం 8 గంటలకు ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తారు. ఆ తర్వాత తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలో గ్రామ సమాఖ్య (వీఓ) భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం కాకరవాయిలో ఓ కుటుంబాన్ని, ఖమ్మం రూరల్ మండలం కామంచికల్ లో మరో కుటుంబాన్ని పరామర్శిస్తారు. ఆ తర్వాత ఏన్కూరు మండలం, మధ్యాహ్నం 12:15 గంటలకు లక్ష్మీదేవి పల్లి మండలంలో పర్యటిస్తారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి తెలిపారు.

కోర్టు కేసుల పెండింగ్ అంశాలపై కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్ష : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

ఉద్యమపోరు, ఖమ్మం, కొత్తగూడెం, అక్టోబర్ 03 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ లో శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కోర్టు డ్యూటీ అధికారులతో కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలు, కేసుల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కోర్టు కేసులకు సంబంధించిన ప్రొటెస్ట్ పిటిషన్లను సక్రమంగా పర్యవేక్షించాలని, నేర విచారణ ప్రక్రియ నిబంధనలైన సీఆర్‌పీసీ 82, 83 ఉత్తర్వులకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ సూచించారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు, నాన్-బెయిలబుల్ వారెంట్లను ప్రత్యేకంగా పర్యవేక్షించి, సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, దర్యాప్తు అధికారులతో సమన్వయం చేసుకుంటూ త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టుల నుంచి జారీ అయ్యే సమన్లను సకాలంలో అమలు చేయించి, ఎలాంటి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులు, ఈ-పెట్టీ కేసులను వారంవారీగా సమీక్షిస్తూ, క్రమం తప్పకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ-ఎఫ్ఐఆర్, ఈ-ఛార్జ్‌షీట్లకు సంబంధించిన వివరాలను కోర్టు డ్యూటీ అధికారులు తమ పరిధిలోని కోర్టుల్లో సక్రమంగా పరిశీలించాలని, ఏవైనా లోపాలు లేదా పెండింగ్ అంశాలు ఉంటే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.కోర్టుల్లో ప్రతిరోజూ జరిగే కేసుల విచారణ వివరాలను సక్రమంగా నమోదు చేసి, ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని ఆదేశించారు. కోర్టు సంబంధిత పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు, దర్యాప్తు అధికారులతో నిరంతరం సమన్వయం

చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. వచ్చే సమీక్షా సమావేశంలోపు పై అంశాలన్నింటిపై స్పష్టమైన పురోగతి సాధించాలని, పెండింగ్ కేసులు, కోర్టు సంబంధిత అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.ఈ సమావేశంలో డీసీఆర్‌బీ సీఐ రాజు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రాఘవయ్య, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో మంత్రులకు స్వేచ్ఛ లేదు : కూనంనేని సంచలన వ్యాఖ్యలు

- కాంగ్రెస్ ప్రభుత్వంలో సరైన సమాధానాలున్నా, చెప్పలేకపోతున్నారు
- కొత్తగూడెం సీటుపై మంత్రులకు ఎందుకంత ఆసక్తి..?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనితీరుకు వ్యక్తిగతంగా 70 మార్కులు
- ఖమ్మం లో జరిగిన మీట్ ద ప్రెస్ లో కూనంనేని

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 3 : రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులకు స్వేచ్ఛ లేదని కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షం బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు, ఆరోపణలకు సరైన సమాధానాలు ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రభుత్వం విఫలమవుతోందని వ్యాఖ్యానించారు. కొన్ని సందర్భా ల్లో ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలకు తానే స్వయంగా సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రాష్ట్రంలో అధికారం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులకు పూర్తి స్థాయిలో స్వేచ్ఛ లేకపోవడం వల్ల ప్రభుత్వ నిర్ణయాలు, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేక పోతున్నారని,ప్రతిపక్ష బీఆర్ఎస్ లేవనెత్తుతున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు అవసరమైన వాస్తవాలు ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ, మంత్రులు వాటిని సమర్థవంతంగా వివరించలేకపోతున్నారని అన్నారు. దీంతో అసెంబ్లీలో తానే వాస్తవాలను వివరించాల్సి వచ్చిందని తెలిపారు. సింగరేణిలో 70 లక్షల టన్నుల బొగ్గు దొంగతనం జరిగిందని బీఆర్ ఎస్ ఆరోపించినప్పుడు దానికి ప్రభుత్వం తరపున మంత్రులు సరైన సమాధానం ఇవ్వలేకపోయారని ఆయన పేర్కొన్నారు. తానే అసెంబ్లీలో ఈ అంశంపై వివరణ ఇవ్వాల్సి వచ్చిందన్నారు. అది బొగ్గు దొంగతనం కాద ని, సింగరేణి లెక్కల్లో ఒక టర్మ్‌లో నమోదైన బొగ్గును తదుపరి టర్మ్‌లో అడ్జస్ట్ చేసి చూపిం చే ప్రక్రియలో భాగంగా తేడాలు ఏర్పడ్డాయని వివరించాల్సి వచ్చిందన్నారు. సుమారు 40 లక్షల టన్నుల బొగ్గును తదుపరి టర్మ్‌లో అడ్జస్ట్ చేసి చూపించిన అంశాన్ని కూడా తానే వివరించాల్సి వచ్చిందని చెప్పారు. అదేవిధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ లో నమోదు చేసిన భూములకు సంబంధించి కూడా ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. 22-ఏ కింద సుమా రు కోటి ఎకరాల భూమిని ధరణిలో తప్పుగా నమోదు చేశారని అందులో ప్రభుత్వ భూము లు, అసైన్డ్ భూములు, దేవాలయాల తదితర భూములు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ భూముల వివరాలను సరిచేసే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి వ్యవస్థలో కూడా కొన్ని వివరాలు తప్పుగా నమోదవుతున్నాయనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా ప్రజలకు వివరించలేక పోతున్నదని అన్నారు. ప్రభుత్వం వద్ద వాస్తవాలు ఉన్నప్పటికీ వాటిని ప్రజలకు సమర్థవంతంగా తెలియజేయక పోవడం వల్ల ఏదో తప్పు జరిగినట్లుగా ప్రజల్లో అపోహలు ఏర్పడుతున్నాయని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, రాష్ట్ర రాజకీయాలు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తదితర అంశాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనితీరుపై తాను వ్యక్తిగతంగా 70 మార్కులు ఇస్తున్నానని కూనంనేని తెలిపారు. అయితే మంత్రులకు పూర్తి స్థాయిలో స్వేచ్ఛ లేకపోవడం వల్ల ప్రభుత్వ నిర్ణయాలు, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించలేకపోతున్నారని స్పష్టం చేశారు. తను ప్రాతినిధ్యం వహిస్తున్న కొత్తగూడెం సీటుపై మంత్రులకు ఎందుకంత ఆసక్తి అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా రెండేళ్ల పాలన సమయం ఉన్నప్పటికీ కొత్తగూడెం అసెంబ్లీ స్థానంపై కాంగ్రెస్ మంత్రులు ఎందుకు ఆసక్తి చూపుతున్నారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మిత్రపక్షంగా తాము కొనసాగుతున్నప్పటికీ ఒక్క కొత్తగూడెం సీటు విషయంలో జిల్లాకు చెందిన మంత్రులు ఎందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారని కునంనేని నిలదీశారు. ప్రజా సంక్షేమం కోసం కమ్యూనిస్టులు కలిసి పనిచేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి రాజకీయ విభేదాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలకు అండగా నిలుస్తోందని కూనంనేని ఆరోపించారు. యువత సమస్యలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం మానుకోవాలని సూచించారు. లేకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదు అన్నారు.దేశంలో యువతను పక్కన పెడితే ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో ఇటీవల జరిగిన జంజీ ఉద్యమం స్పష్టం చేసిందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై జరిగిన ఆ ఉద్యమం కీలకంగా పనిచేసిందని పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మీట్ ద ప్రెస్ కార్యక్రమానికి టియుడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి కట్టెకోల రామనారాయణ సమన్వయకర్తగా వ్యవహరించగా యూనియ న్ జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

పాలనలో సమన్వయ లోపం

- ఆర్థిక విషయంలో మంత్రులకు లేని స్వేచ్ఛ
- ముఖ్యమంత్రి రేవంత్ తీరు బాగున్నా ఎంపికలో పొరపాట్లు
- చట్టం అవినీతి పరులకు చుట్టమవుతుంది
- ఉద్యమాలకు యువతరమే పునాది
- ఓటు తొలగింపు నేరమే : మీట్ ద ప్రెస్ లో కూనంనేని

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 03 : రాష్ట్ర ప్రభుత్వ పాలనలో సమన్వయం లోపించిందని అది ప్రజల్లో వ్యతిరేకతను పెంచుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరు బాగున్నా అనేక అంశాలకు సంబంధించి ప్రాధాన్యత ఎంపికలో పొరపాట్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య మూలాలు దెబ్బతింటున్నాయని పునాదిగా నిలిచిన ఓటు హక్కును తొలగించడం నేరమేనని ఆయన స్పష్టం చేశారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) ఆధ్వర్యంలో శనివారం మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని కూనంనేనితో ఖమ్మంలో నిర్వహించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ యువతరం ప్రజా ఉద్యమాలకు పునాదిగా నిలిచిందని నాటి స్వాతంత్రోద్యమం, సాయుధ తెలంగాణ పోరాటం, తెలంగాణ సాధనోద్యమం, పేదల పక్షాన కమ్యూనిస్టు పార్టీ సాగించిన అనేక పోరాటాల్లో యువతరమే ముందు నిలిచిందన్నారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జన్జీ ఉద్యమించడంతో దిమాగి నక్సల్స్ పేరుతో అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సర్ పేరుతో ఓట్ల తొలగింపు నేరమని ప్రజాస్వామ్యానికి ఓటే మూలస్తంభమని దానిని తొలగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడవడమేనన్నారు. 60 కోట్ల భోఫోర్స్ కుంభకోణం కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతే లక్షల కోట్ల కుంభకోణాలు చోటు చేసుకున్న బిజెపి ప్రభుత్వాన్ని ఏవిధంగా శిక్షించాలని ఆయన ప్రశ్నించారు. జ్ఞానేష్కుమార్ దిగిపోవాల్సిందేనని లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం అవుతుందన్నారు. ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని కొద్ది మంది చేతుల్లో సంపద పోగుపడుతుందని ఆయన తెలిపారు. జర్నలిస్టులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానం ఇస్తూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉన్న సొమ్మును సరైన రీతిలో ఈ ప్రభుత్వానికి ఖర్చు చేయడం చేతకావడం లేదన్నారు. ఆర్థిక వ్యవహారాలు కేంద్రీకృతమవుతున్నాయని వివిధ శాఖల్లో ఖర్చు పెట్టే అవకాశం లేకుండా పోయిందని మంత్రులు స్వేచ్ఛగా పాలన చేసే పరిస్థితి లేదన్నారు. దీనితో కొత్త పంచాయతీలు పుట్టుకొస్తున్నాయన్నారు. కొన్ని హామీలు నెరవేర్చిన అది చెప్పుకునే పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ లేదని సాంబశివరావు తెలిపారు. బొగ్గు దొంగతనం అన్న ప్రచారంలోనూ కాంగ్రెస్ నిజాలను ప్రజలకు వివరించలేకపోయిందన్నారు. ధరణి వల్లనే బిఆర్ఎస్ ఓడిపోయిందని ఇప్పుడు కాంగ్రెస్ కూడా సరైన రీతిలో వ్యవహరించకపోతే ముప్పు తప్పదన్నారు. ఏ ప్రభుత్వమైనా నిషేధిత జాబితాను కొనసాగిస్తారని కానీ చిన్న చిన్న పొరపాట్లు పెద్ద ఇబ్బందులను తెచ్చి పెడుతున్నాయన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అనుభవదారు కాలాన్ని రద్దు చేయడం మళ్లీ భూ యజమానులకు ఊతమిచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకో సమర్థవంతంగా నడపలేకపోతుందన్న భావన వ్యక్తమవుతుందన్నారు. మిత్రపక్షంగా ఉన్న తమకు తెలపకుండానే మా అనుబంధ సంఘాన్ని ఆర్టీసి ఎన్నికల్లో ఓడించేందుకు ప్రయత్నం చేయడం ఓ మంత్రి కమ్యూనిస్టు సంఘాలను ఉద్దేశించి మాట్లాడటం ఇబ్బందికరమన్నారు. కమ్యూనిస్టు యూనియన్లను గెలవనివ్వవద్దన్న ఆయన తీరు సరి కాదని సాంబశివరావు తెలిపారు. ఎంఎల్సి ఎన్నికల్లో పోటీ చేయాలా ఎవరికి మద్దతు ఇవ్వాలా అన్న దానిపై ఇంకా నిర్ణయించలేదన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యంపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ అన్ని నియోజక వర్గాల మాదిరి కొత్తగూడెంలో కూడా పర్యటిస్తే తప్పులేదు కానీ తరచూ పర్యటనలు చేయడం శత్రుపక్ష శాసన సభ్యుని పట్ల వ్యవహరించడం సరికాదన్నారు. అంతిమంగా ప్రజలే నిర్ణేతలన్నారు. మిత్రపక్ష శాసనసభ్యుడు ఉన్న చోట అంతగా పట్టించుకోవాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. కమ్యూనిస్టుల నైతిక మద్దతు కాంగ్రెస్ గెలుపులో కీలక భూమిక పోషించిందన్నారు. ఆర్టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కమ్యూనిస్టులు విడివిడిగా పోటీ చేయడాన్ని ప్రస్తావిస్తూ కలిసిపోతే తప్ప రెండు పార్టీలు విడివిడిగా ఉన్నప్పుడు ఇటువంటి పరిస్థితులు ఎదుర్కొనక తప్పదన్నారు. ప్రజా ఉపయోగకర కార్యక్రమాలు చేపట్టినప్పుడు మిత్రపక్షంగా సమర్థిస్తామని ప్రజలకు నష్టం జరిగే కార్యక్రమాలకు సంబంధించి ప్రశ్నించక తప్పదని ఆయన తెలిపారు. ప్రశ్నించే వారి పట్ల గత ప్రభుత్వం మాదిరే వ్యవహరిస్తూ ముందస్తు అరెస్టులు, ఆందోళనలు అణిచివేతలు చేస్తే గత ఫలితమే పునరావృతమవుతుందన్నారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శంషాబాద్ సర్కిల్‌లో రూ.2.88 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఉద్యమపోరు, శంషాబాద్, అక్టోబర్ 03 : శంషాబాద్ జీహెచ్ఎంసీ సర్కిల్‌లో రూ.2.88 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వరద నీటి కాలువ నిర్మాణ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. శంషాబాద్ సర్కిల్ లోని 118, 119 వార్డుల పరిధిలో ఈ పనులు చేపట్టనున్నారు. వార్డు నంబర్ 118 లో రాఘవేంద్ర హోటల్ నుంచి సంఘీగూడ జంక్షన్ వరకు, వార్డు నంబర్ 119లో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వద్ద ఉన్న బాక్స్ కల్వర్ట్ ఎదురుగా నుంచి కొత్వాల్‌గూడలోని ప్లాట్ నంబర్ 114 వరకు వరద నీటి కాలువ నిర్మించనున్నారు. మొత్తం రూ.2.88 లక్షల వ్యయంతో పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో వరద నీరు నిలిచిపోవడం, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యంగా ఈ పనులను చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. కాలువ నిర్మాణం పూర్తయితే వర్షపు నీరు సులభంగా వెళ్లిపోయే అవకాశం ఉండటంతో స్థానికులకు ముంపు సమస్య నుంచి ఉపశమనం లభించనుంది. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కొత్త మేడేపల్లిలో ఆరోగ్య శిబిరం

ఉద్యమపోరు, ఏన్కూర్, అక్టోబర్ 03 : ఏన్కూర్ మండల పరిధిలోని కొత్త మేడేపల్లిలో శనివారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే చేపట్టారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణలో భాగంగా డ్రై డే కార్యక్రమం నిర్వహించి, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి జి. వెంకటేశ్వర్లు, వైద్య సహాయకురాలు స్వాతి, ఆరోగ్య పర్యవేక్షకురాలు పుష్పారాణి,సహాయక నర్సు నిర్మల, ఆరోగ్య సహాయకుడు దుర్గాప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్యప్రాణులు ప్రకృతికి వరం : నెహ్రూ పార్కు క్యూరేటర్ జె.వసంత

- **వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా సందర్శకులతో కలసి మొక్కలు నాటిన అధికారులు**
- **ఖడ్గమృగం ఎన్‌క్లోజర్ వద్ద సందడి చేసిన జంతుప్రేమికులు.**
- **టాక్ షోతో ఆకట్టుకున్న సీనియర్ యానిమల్ కీపర్ దేవేందర్.**

ఉద్యమపోరు, రాజేంద్రనగర్, అక్టోబర్ 03 : ప్రకృతిలో వన్యప్రాణుల ప్రాముఖ్యత అద్భుతమైనదని నెహ్రూ జూలాజికల్ పార్కు క్యూరేటర్ జె. వసంత అన్నారు. పర్యావరణ సమతుల్యత అడవుల సంరక్షణతో సాధ్యమవుతుందని, ఆ అడవులు సురక్షితంగా ఉండాలంటే వన్యప్ర◌ాణులు, మృగాలు, పక్షుల ఉనికి కాపాడాలని పిలుపునిచ్చారు. ఎవరూ చెప్పినా, చెప్పకపోయిన ప్రతి వన్యప్రాణి తనవంతు పాత్రను అనునిత్యం పోషిస్తుందని చెప్పారు. శనివారం వన్యప్రాణి వారోత్సవాలలో భాగంగా జూ ఆవరణలో సిబ్బంది, సందర్శకులతో కలసి ఆమె విలువైన, భారీ వృక్షజాతి మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తన వంతుగా క్యూరేటర్ జె. వసంత ఎర్ర చందనం మొక్క నాటగా, డిప్యూటీ క్యూరేటర్ జె. మురళీధర్ తన్ని మొక్క నాటారు. అనంతరం జూలోని మొసళ్ల కొలను ప్రాంతంలో మహిళా బృంధాలతో కలసి రేగిస మొక్కలు నాటారు.ఈసందర్భంగా క్యూరేటర్ జె. వసంత ఐఎఫ్ఎస్ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్క వృక్షంగా ఎదిగితే జూ ఆవరణలో ప్రకృతిరమణీయత మరింత పెరుగుతుందన్నారు. ఎర్రచందం ప్రపంచ ప్రఖ్యాతి పొందిందని, శేషాచలం అడవులను పుట్టినిళ్లుగా ఆ మొక్క జాతి తన సంమ్రాజ ఉనికి చాటుతుందని గుర్తు చేశారు.వివిధ ఔషదగ◌ుణాలు, సుంగంధ పరిమళాలను ఎర్రచందనం ద్వారా లభిస్తాయని చెప్పారు. మహానగరం అభివృద్ధిలో శరవేగంగా దూసుకుపోతుందని, అందుకు అనుగుణంగా పచ్చనం పెంపొందించడం అవసరమన్నారు. అందుకోసం అటవీశాఖ, వన్యప్రాణి విభాగాలు వివిధ కోణాలలో కృషి చేస్తున్నాయని తెలిపారు.ప్రజలు ప్రకృతి ప్రేమికులుగానే కాకుండా సంరక్షణకులుగా మారాలని పిలుపునిచ్చారు. వన్యప్రాణి సంరక్షణ తోపాటు ప్రకృతిలో వాటి ప్రాముఖ్యత గురించి సందర్శకులకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 2 నుండి 8 వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. సందర్శకులలో పర్యావరణ పరిరక్షణ విజ్ఞానం పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా చైతన్యం చేస్తున్నట్లు ఆమె వివరించారు.అనంతరం ఖడ్గమృగం ఎన్‌క్లోజర్ వద్ద వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను సీనియర్ యానిమల్ కీపర్ దేవేందర్ తనదైశ◌ైలిలో సందర్శకులు టాక్ షో ద్వారా తెలిపారు. ఖడ్గమృగం యొక్క ప్రవర్తన, ఆయుర్దాయం తోపాటు జూలో వాటి ఆహారపు అలవాట్ల గురించి క్లుప్తంగా సందర్శకులకు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సుమారు 1200 మంది సందర్శకులు ఖడ్గమృగం గురించి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే సోషల్ మీడియా ద్వారా కూడా యానిమల్ కీపర్ వివరిస్తూన్న తీరును పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. మోహన్ రెడ్డి, సిసిఎంబి లాకోన్స్ శాస్త్రవేత్త డా. సాంబశివ రావు, అసిస్టెంట్ క్యూరేటర్ బి. లక్ష్మణ్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హేమ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె. వెంకట్ రావు, పిఆర్‌వో హెచ్.ఎం. హనీఫుల్లా, జూ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సిహెచ్. దీపక్ తరుణ్,గార్డెన్ సూపర్‌వైజర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో జరిగే 'ఓబీసీ సింహగర్జన' సభను చారిత్రాత్మక విజయవంతం చేయాలి

- రంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

ఉద్యమపోరు, మహేశ్వరం, అక్టోబర్ 03 : రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్ – గొల్లపల్లి రోడ్డులో రేపు నిర్వహించనున్న ప్రతిష్టాత్మక 'ఓబీసీ సింహగర్జన' బహిరంగ సభా స్థలాన్ని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, టీపీసీసీ ఓబీసీ ఛైర్మన్ మరియు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు సభా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో వేదిక, తరలివచ్చే ప్రజలకు సరిపడా వసతులు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లపై అధికారులతో మరియు నాయకులతో సమీక్ష నిర్వహించి తగిన సూచనలు అందజేశారు. బీసీ, బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన, రాజకీయ మరియు సామాజిక ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు ఈ మహాసభ వేదిక కానుందని నాయకులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ శ్రేణులు, ఓబీసీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. బడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా తలపెట్టిన ఈ ఓబీసీ సింహగర్జన సభను అందరి సమైక్య కృషితో విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

మహిళల భద్రతకే మా ప్రాధాన్యం: సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్

- **గట్టు ఇప్పలపల్లి ఊర చెరువు వద్ద బతుకమ్మ మెట్ల ప్రారంభం**

ఉద్యమపోరు, తలకొండపల్లి, అక్టోబర్ 03 : మహిళల ఆత్మగౌరవానికి, సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు భయాందోళనలు లేకుండా, సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఊర చెరువు వద్ద ప్రత్యేకంగా మెట్ల నిర్మాణాన్ని చేపట్టామని తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామ సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్ (మెట్లు), విద్యుత్ దీపాల అలంకరణను ఆయన శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా బతుకమ్మ పండుగ వస్తే చాలు, గౌరమ్మను గంగమ్మ ఒడికి చేర్చే క్రమంలో మహిళలు చెరువులోకి దిగడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. లోతు ఎక్కువగా ఉండటంతో ఎవరో ఒకరు లోపలికి వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఈ ఇబ్బందులను గమనించి, మహిళా తల్లులు స్వయంగా తామే వెళ్లి భక్తి శ్రద్ధలతో బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేసేలా సురక్షితమైన మెట్లను నిర్మించామని, రాత్రి వేళల్లో ఇబ్బంది లేకుండా ఉండేందుకు అత్యాధునిక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిత విజయ్, వార్డు సభ్యులు రాజశేఖర్, రేన్ రెడ్డి, నిర్మాణ పనులు చేపట్టిన మేస్త్రీలు నరసింహ, జీవతో పాటు గ్రామ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ను కలిసిన దళిత సంక్షేమ సమితి అధ్యక్షులు కొండ్ర ఓంప్రకాష్ బృందం

ఉద్యమపోరు, మహేశ్వరం, అక్టోబర్ 03 : జిల్లెలగూడ చందన చెరువు కట్టపై ఆది జాంబవంతుని విగ్రహ ప్రతిష్ట కొరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి గారిని అనుమతి గురించి మనవి చేయడం జరిగింది. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తొందర్లోనే అనుమతి ఇస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మాజీ కార్పొరేటర్ గజ్జల రామచందర్ దళిత సేన పోగుల నరసింహ ఎంఆర్పిఎస్ నాయకులు మేడి మహేష్ మాదిగ అరుంధతి సంఘం మంద బలరాం, సాగ శ్రీనివాసులు,జనిగే నరేష్ మాదిగ, ముకపల్లి బాలకృష్ణ, సి ప్రసాద్, షాహి మల్లేష్, దండు యాదయ్య పాల్గొనారు.

అనంతగిరి బస్సు ప్రమాదంపై కేటీఆర్ దిగ్భ్రాంతి

- **బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలి: చైతన్య కిరణ్**

ఉద్యమపోరు, వికారాబాద్, అక్టోబర్ 03 : వికారాబాద్ జిల్లా అనంతగిరి సమీపంలో బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బీఆర్ఎస్ నాయకుడు, న్యాయవాది చైతన్య కిరణ్ మల్కాపురం అన్నారు. ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం, పలువురు గాయపడటం బాధాకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ప్రమాద ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంటనే స్పందించి దిగ్భ్రాంతి వ్యక్తం చేయడంతో పాటు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు సహాయక చర్యల్లో పాల్గొని క్షతగాత్రులకు అవసరమైన సహాయం అందించాలని సూచించడం అభినందనీయమని చైతన్య కిరణ్ అన్నారు. బాధితులకు అవసరమైన సహాయం అందేలా అధికారులు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.వికారాబాద్ జిల్లాలో ప్రజల భద్రత, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడం, ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ప్రమాద ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి సహాయక చర్యలను పర్యవేక్షించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని చైతన్య కిరణ్ కోరారు. ప్రమాదానికి దారితీసిన కారణాలను సమగ్రంగా పరిశీలించి, అనంతగిరి ప్రాంతంలో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే తగిన పరిహారం అందించాలని, గాయపడిన వారికి కూడా ఆర్థిక సహాయం కల్పించాలని చైతన్య కిరణ్ కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి, అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని విజ్ఞప్తి చేశారు.

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act
prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 7569337969 Email:udyamaporu@gmail.com